క్లుప్తంగా...

ఎల్ఐజీలో సమస్యలపై చర్చ

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఎల్ఐజీ కాలనీలో నెలకొన్న సమస్యలపై కాలనీ సొసైటీ ప్రతినిధులు చర్చించారు. ప్రధానంగా డ్రైనేజీ, విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు సీతారాం, కార్యదర్శి రామాంజనేయులు చెప్పారు. కొన్ని బ్లాకుల్లో వాటర్ లీకేజ్ అవుతున్నట్లు గుర్తించామన్నారు. లీకేజీతో భవనాలు దెబ్బతినే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు.

నేడు మేడ్చల్‌కు ఎమ్మెల్సీ కవిత



మేడ్చల్: పట్టణంలోని మూడవ వార్డు పరిధిలోని కేఎల్ఆర్ ఫేజ్–2 కమాన్ వద్ద ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం, అమర వీరుల స్తూపాన్ని ప్రారంభించేందుకు ఎమ్మెల్సీ కవిత హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8గంటలకు నిర్వహించే కార్యక్రమానికి తెలంగాణ అభిమానులు, ఉద్యమకారులు బీఆర్ఎస్ నాయకులు హాజరుకావాలని కోరారు. ఎమ్మెల్సీ కవిత పర్యటన సందర్భంగా ఏర్పాట్లను బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి పరిశీలించారు.

పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో హరితహారం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్(అంబర్‌పేట్)లో శనివారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ ఎస్పీ మధుకర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ ట్రైనింగ్ ఐజీపీ, ఐపీఎస్ తరుణ్ జోషి ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం సెంటర్‌లో శిక్షణ పొందుతున్న పోలీసులు సమావేశంలో పాల్గొని హరితహారం, సమాజ శ్రేయస్సులో పోలీసుల బాధ్యతపై వివరించారు. హరిత హారంలో భాగంగా 800 మొక్కలు నాటినట్లు మధుకర్ స్వామి తెలిపారు. ట్రైనింగ్ సెంటర్ వైస్ ప్రిన్సిపాల్స్ డీఎస్పీ జగన్, పోచయ్య, గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ రాములు, పోలీస్ అధికారులు చంద్రశేఖర్, లక్ష్మీకాంత్, రవికిరణ్, విజయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, రామారావు సిబ్బంది పాల్గొన్నారు.

నో వెయిటింగ్..



మేడ్చల్ తుమ్మ చెరువు కట్టపై సీసీ రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న మహేందర్‌రెడ్డి



ఘట్‌కేసర్‌లో అభివృద్ధి పనులకు డబ్బులు అందజేస్తున్న భద్రారెడ్డి

మేడ్చల్: మీ ప్రాంతంలో రోడ్డు లేదా.. మౌలిక వసతులు కరువయ్యాయా.. ఆలయాలు, మసీదుల నిర్మాణాలు కొనసాగాలా.. డ్రైనేజీ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారా..? అయితే మా వెంట వస్తే అన్ని వసతులు సమకూరుస్తామని బీఆర్ఎస్ నాయకులు మంత్రి మల్లారెడ్డి వద్దకు తీసుకెళ్తున్నారు. అభివృద్ధి పనులను చకచకా చేసేస్తున్నారు. రాష్ట్ర రాజకీయాల్లోనే సంచలనంగా ఉన్న మంత్రి మల్లారెడ్డి వచ్చే ఎన్నికల్లో మేడ్చల్ నుంచి మరో మారు ఎమ్మెల్యేగా గెలిచేందుకు తన దగ్గర ఉన్న అన్ని శక్తులను ఉపయోగిస్తున్నారు. రిచ్ పొలిటిషియన్, కార్పొరేట్ నాయకుడిగా పేరుండటంతో ప్రభుత్వ నిధులతో కాకుండా సొంత డబ్బులను సమకూరుస్తూ.. రూ.కోట్లు ఖర్చు చేస్తూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలోని గ్రామాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కులసంఘాలకు ఆత్మగౌరవ భవనాలు, ఆలయాల నిర్మాణానికి, మసీదుల అభివృద్ధికి సొంత నిధులు ఖర్చుచేస్తూ ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డారు. నాలుగేళ్లుగా కేవలం ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో అభివృద్ధి పనులు చేసిన మంత్రి మల్లారెడ్డి నెల రోజుల నుంచి గేరుమార్చి ఏకంగా గల్లీ గల్లీలో సీసీ రోడ్లు వేయిస్తున్నారు. అన్ని మండలాల్లో జోరుగా పనులు చేయిస్తున్నారు. బీఆర్ఎస్ నాయకుల ద్వారా కులసంఘాల వారిని తన వద్దకు రప్పించుకుని వారికి కావాల్సిన భవనాల కోసం ఫండింగ్ చేస్తున్నారు.

ఏళ్లకేళ్లు ఎదురు చూపులు లేకుండా..

- సొంత నిధులతో ప్రతిగల్లీలో సిమెంట్ రోడ్లు
- ఆలయాలు, మసీదుల నిర్మాణాలకు నిధులు
- అప్పటికప్పుడే మౌలిక వసతుల కల్పన
- అన్ని పావులు వాడుతున్న మంత్రి మల్లారెడ్డి
- మంత్రి కుమారుల సుడిగాలి పర్యటనలు

నో కాంట్రాక్టర్.. నో ఆఫీసర్..

గ్రామాల్లో సీసీ రోడ్డులు, డ్రైనేజీ, ఇతర పనులకు మంత్రి కుమారులు మహేందర్‌రెడ్డి, భద్రారెడ్డి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. నాయకులు కేవలం తమ గ్రామంలో ఎక్కడ రోడ్డు వేయాలో చెబితే చాలు మంత్రి మనషులే దగ్గరుండి అన్ని పనులు పూర్తి చేయిస్తున్నారు. మంత్రి తనయులు మహేందర్‌రెడ్డి, భద్రారెడ్డిలు దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. రోడ్లు, ఇతర పనుల సమయంలో కాంట్రాక్టర్లు గానీ, అధికారులు గానీ, ఎక్కడా కనిపించడం లేదు. బీఆర్ఎస్ నాయకులు, మంత్రి తనయులు కార్మికులతో రెడీమిక్స్ లారీల ద్వారా రెడీమేడ్ కాంక్రీట్‌ను తెప్పించి గంటల వ్యవధిలో సీసీ రోడ్లు వేయిస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని ఏ వార్డులో చూసినా, ఏ గ్రామంలో చూసినా మంత్రి మల్లారెడ్డి సొంత నిధులతో చేపడుతున్న పనులే జోరుగా సాగుతున్నాయి.

జోరుగా ప్రచారం..

మంత్రి చేస్తున్న అభివృద్ధి పనులను సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం చేస్తున్నారు. అభివృద్ధి పనులపై అభిప్రాయాలు సేకరించి వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ప్రచారం అటుంచితే.. ఎన్నో ఏళ్లుగా పూర్తికాని పనులు చకచకా పూర్తవడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దరు తనయుల పర్యటన



మంత్రి మల్లారెడ్డితో తనయులు మహేందర్‌రెడ్డి, భద్రారెడ్డి

మంత్రి మల్లారెడ్డి ఇద్దరు తనయులు రాజకీయంలో చురుగ్గానే ఉన్నారు. తండ్రీ చాటు కొడుకుల్లా తండ్రీ చెప్పిన మాటలను అమలు చేస్తున్నారు. పెద్ద కుమారుడు చామకూర మహేందర్‌రెడ్డి బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉండగా.. చిన్న కుమారుడు డాక్టర్ భద్రారెడ్డి రాజకీయంలో చురుగ్గా ఉన్నాడు. మహేందర్‌రెడ్డి మేడ్చల్, శామీర్‌పేట్, మూడుచింతలపల్లి మండలాలు, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తూముకుంట మున్సిపాలిటీలు, జవహర్‌నగర్ కార్పొరేషన్లకు ఇన్‌చార్జిగా ఉండగా, చిన్న కుమారుడు ఘట్‌కేసర్, కీసర మండలాలకు, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీలు, పీర్జాదిగూడ, బోడుప్పల్ కార్పొరేషన్లకు ఇన్‌చార్జిగా ఉండి తండ్రి పనులను చక్కబెడుతున్నారు. గత ఎన్నికల్లో క్రియాశీలంగా పనిచేసిన వీరిద్దరు కొంతకాలంగా చురుగ్గా పని చేస్తూ తండ్రి కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. మంత్రి అల్లుడు రాజశేఖర్‌రెడ్డి బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జిగా నియమించడంతో ఆయన అక్కడి రాజకీయాల్లో బిజీగా మారడంతో మేడ్చల్‌లో పెద్దగా కనిపించడం లేదు.

ఉప్పర్‌పల్లిలో చెరువు అలుగు కబ్జా

కలెక్టర్ కార్యాలయంలో మత్స్య కార్మిక సంఘం వినతి

మేడ్చల్‌రూరల్: తూముకుంట మున్సిపాలిటీ పరిధి ఉప్పర్‌పల్లిలో చెరువు అలుగు కబ్జాకు గురవుతోందని, దాన్ని కాపాడాలంటూ మత్స్య కార్మిక సంఘం నాయకులు శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్పర్‌పల్లిలోని పల్లె చెరువు అలుగు వద్ద సర్వే నెంబర్–1001లో ఉన్న 2 వేల గజాల ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జా చేశారని, ఈ విషయంపై తహసీల్దార్, తూముకుంట మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోవడంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘానికి స్థలం కేటాయించాలి



నాగారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తూ..

కీసర: నాగారం మున్సిపాలిటీలో నివాసం ఉంటున్న సుమారు 500పైగా పద్మశాలి కుటుంబాల కోసం మున్సిపల్ పరిధిలో 500 గజాల స్థలాన్ని పద్మశాలి సంఘం కోసం కేటాయించాలని కోరుతూ శనివారం నాగారం మున్సిపల్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కూరపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రమేష్, మధుసూదన్, నర్సింగ్, రవి, రాజయ్య, శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌లో అదనపు గది పనులు షురూ



ఘట్‌కేసర్: అవుషాపూర్ పాఠశాలలో మండల నిధులతో నిర్మిస్తున్న అదనపు తరగతి గది పనులు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ అవుషాపూర్ పాఠశాలకు మన ఊరు మన బడి నిధులు కేటాయించలేదని, పదో తరగతి వరకు 200 మంది విద్యార్థులుంటే ఐదుగురే ఉపాధ్యాయులు ఉన్నారని అన్నారు. పాఠశాలలో అదనంగా ఉపాధ్యాయులను కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. వెంకట్‌రెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, వామన్‌రెడ్డి, హెచ్ఎం రవి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి ప్రణాళిక



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ దీపికరెడ్డి

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రణాళిక బద్ధంగా నిధులు మంజూరు చేస్తూ 23వార్డులను అభివృద్ధి చేస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి తెలిపారు. కౌన్సిల్ హాల్‌లో శనివారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడుతూ 23 వార్డుల్లో పనులు చురుగ్గా సాగుతున్నాయని అన్నారు. వార్డుల అభివృద్ధికి రూ.12.20 కోట్ల పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో వైస్ చైర్మన్ రమేష్, కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, డీఈ విజయలక్ష్మి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన బండమాదారం నాయకులు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: మండలంలోని బండమాదారం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, వార్డు సభ్యులు బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి మల్లారెడ్డి నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యులు సత్యనారాయణ, పాండు, ఈశ్వర్, నాయకులు వెంకటేష్, నాగులు, సైలయ్య తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, నాయకులు రాజమల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



జవహర్‌నగర్‌లో మందులు అందచేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: లయన్స్ క్లబ్, సూర్యోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, యశోద ఆస్పత్రి సౌజన్యంతో శనివారం జవహర్‌నగర్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పేద ప్రజలకు సేవలందిస్తున్న లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు. శిబిరంలో సుమారు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సీతారాం, లయన్స్ క్లబ్ గవర్నర్ హరీష్‌రెడ్డి, మీర్‌పేట లయన్స్ క్లబ్ అధ్యక్షులు సత్యనారాయణ, సురేఖరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మహేష్, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడాలి

ఘట్‌కేసర్: నూతన ఆవిష్కరణలు సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే విధంగా ఉండాలని హైదరాబాద్ బిట్స్ పిలానీ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ ఎంబీ శ్రీనివాస్ అన్నారు. శనివారం కాచవానిసింగారం నల్లా మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్టార్టప్‌ల దిశగా పయనిస్తున్న విద్యార్థులను అన్ని రకాలుగా ప్రోత్సహించాలని, అప్పుడే లక్ష్యం చేరుకుంటారన్నారు. సాంకేతిక పరిష్కారాల కోసం విద్యార్థులు ఒక విభాగానికి పరిమితం కాకుండా అన్ని విభాగాల్లో సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ దివ్య నల్లా, ప్రిన్సిపల్ ఎంఎస్‌వీ రమేశ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మేడ్చల్: హరితహారంలో భాగంగా మేడ్చల్ పట్టణంలోని ప్రతి వార్డులో ప్రతి ఇంటి వద్ద మొక్క నాటాలని మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో కమిషనర్ త్రిలేశ్వర్‌రావుతో కలిసి మహిళలకు మొక్కలను అందజేశారు. ప్రతి ఒక్కరికీ మొక్కలను పంపిణీ చేస్తామని, యజ్ఞంలా భావించి మొక్కలు నాటి పరిరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. కౌన్సిలర్లు ఉమానాగరాజ, హరికృష్ణ యాదవ్, మణికంఠగౌడ్, సాయికుమార్ మహిళలు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లిలోని శ్రీచైతన్య పాఠశాలలో హరితహారంలో భాగంగా హరిత భారత్ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. పాఠశాల యజమాన్యం విద్యార్థులకు పాఠశాల ఆవరణలో నాటేందుకు ఒకటి, ఇంటి ఆవరణలో నాటేందుకు మరొ మొక్కను అందజేశారు. ప్రిన్సిపాల్ జితేందర్, అకాడమిక్ డైరెక్టర్ సీమ, ఏజీఎం రమణారావు, విక్రంరెడ్డి, జైపాల్‌రెడ్డి, సోమేష్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షిస్తాం

కీసర: నాగారం మున్సిపాలిటీల్లో మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించేందుకు ప్రత్యేక ప్రణాళిక ఉందని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులోని వెస్ట్‌గాంధీనగర్ మొక్కలను నాటే కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో అవసరమైన చోట మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ చంద్రశేఖర్, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, డీఈఈ రఘు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ నాయకుల ముందస్తు అరెస్ట్



మేడ్చల్: గ్రూపు–2 పరీక్షలను వాయిదా వేయాలని ఎన్ఎస్‌యూఐ చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో మేడ్చల్‌లో ఎన్ఎస్‌యూఐ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి నాయకులు వెళ్లకుండా ఉదయాన్నే ముందస్తు అరెస్టులు చేసి మేడ్చల్ ఠాణాకు తరలించారు. అరెస్టయిన వారిలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ యాదవ్, కార్యదర్శి రోహిత్ తదితరులున్నారు.

సీసీ పనుల పరిశీలన

ఘట్‌కేసర్: 16వ వార్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను చైర్ పర్సన్ పావనీజంగయ్య, కమిషనర్ సాబేర్ అలీతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ మంత్రి మంజూరు చేసిన ప్రత్యేక నిధులతో రోడ్డు వేయించామని, రానున్న రోజుల్లో మున్సిపాలిటీలో మరిని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కుతుబ్, అస్లాం, జహంగీర్, భూపతిగౌడ్, వెంకటేశ్వర్లు, బాలరాజు, శ్రీనివాస్, ఫయూమ్, విజయ్‌ముదిరాజ్, రోడ్డు భవనాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలల్లో పోషక విలువలు

కీసర: అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీలో అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని, అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలను తాగించాలన్నారు. వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు అనితసుధాకర్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, యశోద, అంజమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, హెల్త్‌డాక్టర్ కుమార్, ఏఎన్ఎం రాణి, ఆశ వర్కర్లు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పట్టవా..?

కీసర: గ్రామ పంచాయతీల పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు బీజేపీ నేత నల్లవెంకట్‌రెడ్డి సహకారంతో నిర్వహించిన వంటావార్పు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నెల రోజులుగా పంచాయతీ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదన్నారు. బీజేపీ నేతలు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, మెట్టు కృష్ణాయాదవ్, మెట్టు మహేందర్ యాదవ్, వేణుగోపాల్, నల్ల నారాయణరెడ్డి, ఆంజనేయులు, పెద్దులు, రాములుచారి, సాయినాథ్‌గౌడ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

'అన్ని రంగాల్లో మోసం చేసిన బీఆర్ఎస్'



భోగారంలో ఇంటింటికీ కాంగ్రెస్ ప్రచారం

కీసర: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు చేసే మంచి పనులను గ్రామాల్లో ప్రజలకు తెలియజేసేందుకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ పర్యటిస్తున్నట్లు యూత్ కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా జనరల్ సెక్రటరీ బద్దం రుక్వర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం కీసర మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కందాడి శివరాంరెడ్డి ఆధ్వర్యంలో భోగారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను అన్నిరంగాల్లో మోసం చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు శశాంత్‌గౌడ్, కీసర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్, యూత్‌కాంగ్రెస్ కీసర మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దం మల్లేష్, నేతలు సుంకరి జైహింద్‌రెడ్డి, బాల్‌నర్సింహ, గన్నెర్ల సత్యనారాయణ, ప్రవీణ్‌కుమార్, రాజు యాదవ్, మల్లేష్‌యాదవ్, శివయ్య, షేక్‌హైమద్, ఉపేందర్‌యాదవ్, భాను, డీజే సాయి, పవన్, వరుణ్‌కుమార్, కృష్ణాయాదవ్ తదితరులుపాల్గొన్నారు.

విద్యావలంటీర్లకు వేతనాలు అందజేత

ఘట్‌కేసర్: పట్టణంలోని జెడ్పీ బాలికల పాఠశాలలో 6, 7, 8 తరగతి విద్యార్థినులకు హిందీ, తెలుగు ఉపాధ్యాయుల కొరత ఉందన్న హెచ్ఎం విన్నపం మేరకు జన చైతన్య సేవా సమితి ఆధ్వర్యంలో 2023–24 విద్యాసంవత్సరానికి ఇద్దరు విద్యావలంటీర్లను నియమించారు. జూలై మాసం విద్యావలంటీర్లు ఇద్దరికీ వేతనం రూ.14 వేలను ఈడబ్ల్యూఎస్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి శశిధరన్, గోపాల్, రవీందర్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో జనచైతన్య సేవా సమితి ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, హెచ్ఎం అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచి పనికే సాంకేతికతను వినియోగించాలి



మాట్లాడుతున్న చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి

ఘట్‌కేసర్: సాంకేతికతను మంచికి వినియోగించినప్పుడే లక్ష్యం నెరవేరుతుందని అనురాగ్ యూనివర్సిటీ (ఏయూ) చైర్మన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మొదటి సంవత్సరం విద్యార్థులకు శనివారం నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతికి అధ్యాపకుల పాత్ర ఎంత ఉంటుందో అంతే బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఆధునిక కాలంలో విద్యార్థులను ఎల్లప్పుడూ తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని, అప్పుడే వారికి భవిష్యత్ ఉంటుందన్నారు. యూనివర్సిటీ చాన్స్‌లర్ యూబీ దేశాయ్, రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల, సీఈఓ నీలిమా, డీన్‌లు విజయకుమార్, డీన్‌లు సుధీర్‌రెడ్డి, ముత్తారెడ్డి, శ్రీనివాసరావు, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ శ్రీనివాస్‌రావు, శిక్షణ ప్లేస్‌మెంట్ మమత పాల్గొన్నారు.